టెక్స్‌టైల్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యువతకు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సులో మూడేండ్ల ఉచిత శిక్షణ కోసం 'కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ' వారు దరఖాస్తులు కోరుతున్నారు. ఈ ఇనిస్టిట్యూట్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉందని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకురాలు వీ ఇందిర సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అడ్మిషన్ నోటిఫికేషన్ ఏప్రిల్ మొదటి వారంలో వెలువడిందని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే చేనేత, జౌళి శాఖ హైదరాబాద్ కార్యాలయంలో సంప్రదించాలని.. మరిన్ని వివరాలకు 90632 25878 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా సర్వే శిక్షణకు ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండి కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ డ్రాఫ్ట్‌మన్ (సివిల్), డిప్లొమా ఇన్ సివిల్, బీటెక్ ఇన్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.పదివేలు, బీసీ అభ్యర్థులకు రూ.5వేలు, ఎస్సీ /ఎస్టీ అభ్యర్థులకు రూ. 2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో మొత్తం 50 పనిదినాల్లో తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని వెల్లడించారు. అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంచేశారు. ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా సర్వే అధికారి శ్రీరామ్ ఫోన్ నెంబర్ 98483 68659, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అనంతరెడ్డి 94404 38475 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అందని పౌష్టికాహారం!

ప్రభుత్వాసుపత్రుల్లో డైటీషియన్ల కొరత ఖాళీల భర్తీలో తీవ్ర జాప్యం

- నిలోఫర్, ఉస్మానియా, మెటర్నటీ ఆసుపత్రుల్లో డైట్‌పై పర్యవేక్షణ కరువు
- రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

సిటీబ్యూరో/ తెలుగు యూనివర్సిటీ, మే 12,(నమస్తే తెలంగాణ): సర్కార్ దవాఖానల్లో చేరే రోగి సంరక్షణలో ప్రధాన పాత్ర పోషించే రెగ్యులర్ డైటీషియన్లు లేకపోవడం మూలానా పోషకాలు లేని తిండే గతైతోంది. జిల్లా పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో డైట్ ప్లాన్ క్రమపద్ధతిలో అమలు చేసే చీఫ్ డైటీషియన్, డైటీషియన్ పోస్టులు భర్తీ చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం. గతంలో పనిచేసిన వారంతా ఆరునెలల క్రితం బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లగా.. ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందంటూ విమర్శలున్నాయి. దీంతో సరైన పోషకాలు లేని తిండి తింటూ రోగులు కోలుకోవడంలో సమయం ఎక్కువపడుతోందనే వాదనలు ఉన్నాయి.

బీఆర్ఎస్ హయాంలో పక్కాగా అమలు

ప్రభుత్వాసుపత్రుల్లో చేరే ఇన్‌పేషెంట్లందరికీ ఉచితంగా మూడు పూటల పోషకాలు కలిగిన ఆహారం అందించాలని గత బీఆర్ఎస్ సర్కార్ నిర్ణయించడంతో పాటు వెంటనే అమలు చేసింది. అందులో భాగంగానే వాటిలో పోషకాల శాతం, రోగి ఆరోగ్యానికి అవసరమైన ఆహారం అందించేందుకు డైటీషియన్లను నియమించారు. వైద్యులు, నర్సులతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందంతో డైటీషియన్లు సమన్వయం చేసుకుంటూ నిరంతరం రోగికి కావాల్సిన పోషకాలతో కూడిన ఆహారాన్ని తగిన మోతాదులో అందించేవారు. సాధారణ వ్యాధులతో పాటు డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక ఆహార నియమాలు సూచించడటం, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవవాలనేది కూడా కుటుంబసభ్యులకు డైటీషియన్లే తెలియజేసేవారు.

ఖాళీల భర్తీలో తీవ్ర జాప్యం..

ఉస్మానియాకు నిత్యం 3వేల మంది ఔట్ పేషెంట్లు, 1,200మంది ఇన్‌పేషెంట్లు చికిత్స కోసం వస్తుంటారు. నిలోఫర్‌లో ఔట్‌పేషెంట్లు సుమారు వేయి మంది, ఇన్‌పేషెంట్లు 300 మంది ఉండగా కోఠి మెటర్నిటీలో నిత్యం 800 మంది ఔట్‌పేషెంట్లు, 200 మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలందిస్తుంటారు. ఇన్‌పేషెంట్లకు సరైన సమయంలో పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించడంలో డైటీషియన్లు కృషిచేసేవారు. ఇటీవల ఆయా ఆసుపత్రుల్లో ఉన్న చీఫ్ డైటీషియన్, డైటీషియన్లు బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లడంతో ఆ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఇప్పటివరకు వారి స్థానంలో రెగ్యులర్ వారిని నియమించలేదు. ప్రస్తుతం ఉస్మానియాలో కాంట్రాక్ట్ పద్ధతిలో డైటీషియన్ నియామకం కాగా, నిలోఫర్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్ఎంవో స్థాయి అధికారులే అడపాదడపాగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం.

సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కరువు

రెగ్యులర్ డైటీషన్లను నియమించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. నిత్యం నాణ్యతలేని, పోషకాలు లోపించిన తిండి తింటూ మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. సామాన్య రోగులకు అందించే భోజనంపై ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్ల పర్యవేక్షణ లేకపోవడం మూలానా ఇష్టానుసారంగా రోగులకు ఆహారాన్ని అందిస్తున్నారు. ఈ తిండి తింటే మరిన్ని రోజులు ఆసుపత్రిలోనే గడపాల్సి వస్తుందని భయపడి చాలా మంది రోగులు ఆ భోజనాన్ని తినకుండా చెత్తబుట్టల్లో పడేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సొంతడబ్బుతో బయటినుంచి తెప్పించుకొని తింటున్నారు. వైద్య సేవల్లో ఎంతో ప్రాముఖ్యత గాంచిన ఉస్మానియా, నిలోఫర్, ప్రభుత్వ మెటర్నిటీ వంటి ఆసుపత్రుల్లో డైటీషియన్లు లేకపోవడం మూలానా రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వీలైనంత మేరకు రెగ్యులర్ చీఫ్ డైటీషియన్లు, డైటీషియన్ పోస్టులను భర్తీ చేయాలంటూ రోగుల సహాయకులు అభిప్రాయపడుతున్నారు.

స్థలం ఒకచోట.. అనుమతులు మరోచోట

(మొదటిపేజీ తరువాయి)

అది నాలా పక్కనున్న స్థలం కాదని, మిథిలానగర్‌కు ఎగువభాగంలో ఉన్న స్థలమని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించామని, జీహెచ్ఎంసీ ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని జోనల్ కమిషనర్‌కు లేఖ రాశామని షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు.

జీహెచ్ఎంసీ అనుమతులపై ఆరా..

ఉదయ్‌నగర్‌లో నాలాను ఆనుకుని ఉన్న స్థలంలో రెవెన్యూ క్లియరెన్స్ కోరకుండానే జీహెచ్ఎంసీ అనుమతులు ఎలా ఇచ్చారనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. 2023 డిసెంబర్‌లో శివరాజ్ ఠాకూర్ పెట్టిన దరఖాస్తులను అప్పటి జోనల్ కమిషనర్ తిరస్కరించారని తేలింది. అయితే 2025 జనవరిలో మరోసారి దరఖాస్తు చేశారు. సర్వే నంబర్ 403లోని స్థలం ప్రభుత్వ స్థలంగా రెవెన్యూ రికార్డులో ఉంటుందని, దానిలో దరఖాస్తు వస్తే వెంటనే రెవెన్యూ క్లియరెన్స్ తీసుకోవాల్సిన జీహెచ్ఎంసీ ఆ పనిచేయకుండా దరఖాస్తు వచ్చిన వెంటనే అనుమతి ఇవ్వడంలో ఆంతర్యమేమిటని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో విచారణ చేపట్టేందుకు జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌తో పాటు సిటీ ప్లానర్ సాంబయ్య, సర్కిల్ -18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు సోమవారం నాలాను పరిశీలించారు. నీటిపారుదల శాఖ ఇచ్చిన ఎన్‌వోసీలోని వివరాలకు, జీహెచ్ఎంసీ అనుమతి కోసం స్థలం యజమానులు ఇచ్చిన వివరాల్లో తేడాలు ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించారు. 2023 అక్టోబర్‌లో నీటిపారుదలశాఖ అధికారులు జారీ చేసిన ఎన్‌వోసీలో ఇక్కడ నాలా విస్తీర్ణం కేవలం 3.70 మీటర్లు మాత్రమేనని పేర్కొన్నారు. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉదయ్‌నగర్ నాలా విస్తీర్ణం సుమారు 15 నుంచి 20 మీటర్ల దాకా ఉందని తేలడంతో మరింత లోతుగా విచారణ చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో పాటు నిర్మాణదారులు ఇచ్చిన దరఖాస్తులో తమ స్థలం టీఎస్ 29, బ్లాక్-ఓ, వార్డు -11 కిందకు వస్తుందని చెప్పిన విషయాన్ని పట్టించుకోకుండా ఏకంగా ప్రభుత్వ స్థలంలో ఎన్‌వోసీ ఎలా జారీ చేశారనే అంశం చర్చనీయాంశంగా మారింది.

నగరంలోని మహేంద్ర హిల్స్ బుద్ధ విహార్‌లో జరిగిన బుద్ధ జయంతి వేడుకల్లో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

సిటీ బ్యూరో, మే12: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ వినతులు స్వీకరించారు. మొత్తం 62 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 40, ట్యాక్స్ సెక్షన్ 6, అడ్మినిస్ట్రేషన్ 3, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎఫ్ఏ విభాగాలకు 2 చొప్పున, ల్యాండ్ అక్విజిషన్, హెల్త్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఫోన్ ఇన్ ద్వారా 5 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఫిర్యాదులను త్వర పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆరు జోన్లలో మొత్తం 111 అర్జీలు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, నళిని పద్మావతి, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, అడిషనల్ సీసీపీ గంగాధర్, వీరన్న, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 121 అర్జీలు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని అదనపు కలెక్టర్ డాక్టర్ జీ ముకుందరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న ఆయన 121 అర్జీలను స్వీకరించారు. హౌసింగ్ 55, పింఛన్ 40, రెవెన్యూ 13, ఇతర శాఖలకు సంబంధించిన 13 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, జిల్లా అధికారులు జీ ఆశన్న, ఆర్ కోటాజీ, పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, అక్కేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ఘనంగా నర్సుల దినోత్సవం

సిటీబ్యూరో, మే12, (నమస్తే తెలంగాణ): ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని సోమవారం కేర్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ.. నర్సులు ఆరోగ్య వ్యవస్థకు బలమైన స్థంభాలని.. వారి నైపుణ్యం, మానసిక బలంతో ప్రతిరోజు పేషెంట్లకు నాణ్యమైన సేవ అందిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. నగరంలోని పలు అనాథాశ్రమాల్లోని పిల్లల కోసం ఉచిత ఆరోగ్య తనిఖీ శిబిరాలు నిర్వహించి.. ఇందులో పిల్లలకు పీడియాట్రిక్ చెకప్‌లు, పోషకాహార సూచనలు చేశారు. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, చీఫ్ మెడికల్ సర్వీసెస్ ఆఫీసర్ డా.నిఖిల్ మాథుర్, చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ డా.అమిత్ సింగ్, వివిధ ఆసుపత్రుల హెడ్‌లు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అపోలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో..

ప్రపంచ నర్సుల దినోత్సవం అపోలో ఆస్పత్రుల నెట్‌వర్క్‌లోని యూనిట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారాంతపు వేడుకలు, సాంస్కృతిక ప్రదర్శనలు, గ్రాటిట్యూడ్ వాల్ అనే ప్రత్యేక ఫొటో, సందేశాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అపోలో హాస్పిటల్స్ స్ట్రాటజీ డైరెక్టర్ శ్రీమతి సింధూరి రెడ్డి మాట్లాడుతూ.. నర్సుల అంకితభావం, కృషి ఆరోగ్య రంగానికి మూలస్తంభాలని.. వారి భద్రత, శ్రేయస్సు కేంద్ర బిందువుగా ఉంటుందని తెలిపారు.

హైడ్రా ప్రజావాణికి 61 ఫిర్యాదులు

సిటీబ్యూరో, మే 12(నమస్తే తెలంగాణ): బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 61 ఫిర్యాదులందాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 181, 183 పరిధిలో ఉన్న సాయిలక్ష్మి లేఔట్‌లోని 1,800 గజాల పార్కుస్థలం కబ్జా అయ్యిందని, ఇదే కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెం 153,154, 155లో కూడా దాదాపు ఐదెకరాల భూమిలో పార్కులు, రహదారులు కనిపించడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లిలోని హైదర్‌నగర్‌లోని డైమండ్ హిల్స్ కాలనీలో 9ఎకరాల విస్తీర్ణంలో 70 రెసిడెన్షియల్ ప్లాట్లతో ఉన్న లేఔట్‌ను మొత్తం చెరిపేసి కబ్జాదారులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారని ప్లాట్ల యజమానులు ఆరోపించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజల్‌లో జాతీయ రహదారితో పాటు ఓఆర్ఆర్‌ను కలుపుతూ రహదారికి అడ్డంగా ప్రహరీ నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. హయత్‌నగర్ అనుమగల్‌లోని తిరుమల హౌసింగ్ కాలనీలోని 2,955 గజాల జీహెచ్ఎంసీ పార్కును కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని, బాచుపల్లి మండలం నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని తుర్కచెరువులో ఎఫ్‌టీఎల్‌తో పాటు అక్కడ ఉన్న ప్రభుత్వస్థలాలు కబ్జా చేస్తున్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

సికింద్రాబాద్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆర్‌వీ కర్ణన్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సిటీ బ్యూరో, మే 12: సికింద్రాబాద్ జోన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్..జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి పరిశీలించారు. తార్నాక, చిలకలగూడ, పాటిగడ్డ, రసూల్‌పుర, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రతిపాదిత అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. తార్నాక జంక్షన్ ఐల్యాండ్ నిర్మాణ పనులు, గ్రీనరీ ఇంప్రూవ్‌మెంట్ పనులు, చిలకలగూడ హెచ్సీఐటీఐ-ఆర్ యూబీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. సీఅండ్‌డీ వేస్ట్ తరలించని వారికి జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. ఏవోసీ-హెచ్సీఐటీఐ ప్రతిపాదిత రోడ్డును తనిఖీ చేశారు. రసూల్‌పురా హెచ్సీఐటీఐ ఫ్లైఓవర్ ప్రతిపాదిత స్థలాన్ని, అలైన్‌మెంట్ పనులను, పాటిగడ్డ రైల్వే ఓవర్ బ్రిడ్జి - హెచ్ సీఐటీఐ ఫ్లైఓవర్ రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. ప్రకాశ్‌నగర్ ఐఎసీ బంక్, హెచ్పీఎస్ సమీపంలోని వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. ఆస్తిపన్నుకు సంబంధించి ఫీల్డ్ డేటా, జీఐఎస్ డేటా, స్కెచ్ ఆధారంగా పూర్తిస్థాయి నివేదికను వారంలోగా అందించాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

రేవంత్ ఓ శాడిస్టు.. సైకో

ఆ మాటలకు కట్టుబడి ఉన్నా.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్, మే 12: సీఎం రేవంత్ రెడ్డి ఓ సైకో, శాడిస్టు అని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మేడ్చల్‌లోని తన స్వగృహంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈటల సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలన తుగ్లక్ పాలనలా ఉందని అన్నానని, నిరుపేదలు రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న ఇండ్లను కూల్చొద్దని కోరితే 'ఎవరి మాట వినను, నేను అనుకున్నదే చేస్తాను' అని అంటే సైకో కాకపోతే ఏమి అనాలన్నారు. మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం లేదన్నారు. పరిపాలనా మీద రేవంత్ రెడ్డి పూర్తిగా పట్టు కోల్పోయారని విమర్శించారు. అలవికానీ హామీలు ఇచ్చి, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కాగా..కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనా తీరును విమర్శిస్తూ ఎంపీ ఈటల చేసిన వ్యాఖ్యలపై యువజన కాంగ్రెస్ సోమవారం ఈటల ఇంటి ముట్టడికి పిలుపునివ్వగా ఆయన ఇంటి వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఈటల ఇంటివైపు రాగా పోలీసులు అడ్డుకొని దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ తరగతులు

- ఎవ్వరికీ మినహాయింపు లేదు
- స్పష్టం చేసిన విద్యాశాఖ ఉన్నతాధికారులు

మేడ్చల్, మే12 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులు మూడు విడతలుగా మూడు వారాల పాటు జరగనున్నాయి. ఈనెల 20 నుంచి 27 వరకు జరిగే శిక్షణ తరగతులను జిల్లాలోని నాలుగు స్కూళ్లల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలో జరిగే శిక్షణ తరగతులలో ఎస్ఎ-ఇంగ్లీష్, గణితం సోషల్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు, మండల స్థాయి రిసోర్స్ పర్సన్లు, ఉర్దూ మీడియం ప్రైమరీ ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు, ఐఆర్ పీలు పాల్గొననున్నారు. దీనికి సంబంధించి జిల్లాలోని నాచారంలోని డిల్లీ ప్లబిక్ స్కూల్, బాల్‌నగర్‌లోని రెడ్లిఫ్ హైస్కూల్, బాల్‌నగర్ బాలికల పాఠశాల, బీకేగూడ కూకట్‌పల్లి హైస్కూళ్లలో శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులలో కంటెంట్, స్కిల్ లెర్నింగ్, డిజిటల్ ఎడ్యుకేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తదిరత అంశాలపై అవగాహన శిక్షణ ఇవ్వనున్నారు.

ఉపాధ్యాయులందరూ హాజరవ్వాల్సిందే..

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు ప్రతీ ఉపాధ్యయుడు తప్పనిసరిగా పాల్గొనాల్సిందేనని, ఇందులో ఎవరికి మినహాయింపు ఉండదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. శిక్షణ తరగతులు జరిగే కేంద్రాలకు ఉదయం 9 గంటలకు చేరుకుని కేంద్రంలోని కోర్స్ డైరెక్టర్‌కు రిపోర్టు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులపై ఉపాధ్యాయుల నుంచే అనేక విమర్శలు వస్తున్న నేపథ్యంలో శిక్షణ తరగతులను విజయవంతం చేసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులు ఎవరికీ మినహాయింపు ఉండదని శిక్షణ తరగతులలో పాల్గొనాలని ఇప్పటికే ఉపాధ్యాయులకు మెస్సేజ్‌లను పంపినట్లు అధికారుల ద్వారా తెలిసింది.

ఆగిన బతుకమ్మకుంట పనులు..!

- ప్రైవేటు స్థలమంటూ కోర్టుల్లో కేసులు
- జూన్ 10వరకు పనులు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశం
- స్థలం విషయంలో తేలని పంచాయితీ..

సిటీబ్యూరో, మే 12(నమస్తే తెలంగాణ): హైడ్రా గొప్పగా చెప్పుకుంటున్న బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో బతుకమ్మకుంట యథాతథస్థితిలోనే ఉండాలని, తదుపరి విచారణ వరకు ఎలాంటి పనులు చేయవద్దంటూ ఇరు పార్టీలకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హైడ్రా ఈ తీర్పుతో నీరుగారిపోయింది. జూన్ 10వరకు స్టేటస్‌కో ఉండడంతో హైడ్రా చేపట్టిన వ్యర్థాల తొలగింపు పనులను ఆపేశారు. ఇప్పటివరకు మూడుసార్లు ఈ పనులు వాయిదాపడ్డాయి.

కోర్టుల్లో కేసులు..

అంబర్‌పేట మండలం బాగ్‌అంబర్‌పేటలోని సర్వే నంబర్ 563లో 1962-63 లెక్కల ప్రకారం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మకుంట ఉంది. బఫర్‌జోన్‌తో కలిపి 16.13 ఎకరాలు ఉంది. ప్రస్తుతం బతుకమ్మకుంట విస్తీర్ణం 5.13 ఎకరాలు. ప్రస్తుతం ఈ స్థలం విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ స్థలం తనదేనంటూ సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి న్యాయస్థానాలను ఆశ్రయించారు. అంతకు ముందు సయ్యద్ ఆజాం అనే వ్యక్తి వద్ద 1986లో 7 ఎకరాల భూమికి ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ రాసుకున్నారు. కానీ కొనుగోలు ప్రక్రియ పూర్తి కాలేదని తెలిసింది. తర్వాత ఆ భూమి ప్రభుత్వానిదంటూ అధికారులు చెప్పారు. దీంతో 1999లో సయ్యద్ ఆజాం హైకోర్టును ఆశ్రయించారు. కానీ కేసును సివిల్‌కోర్టులో తేల్చుకోవాలంటూ హైకోర్టు చెప్పింది. ఆ తర్వాత సయ్యద్ ఆజాం కేసులో సుధాకర్‌రెడ్డి చేరారు. 2020లో కేసు కొట్టేశారు. తిరిగి సుధాకర్‌రెడ్డి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ వేశారు. ఈ కేసుకు సంబంధించిన ఇంజక్షన్ అప్లికేషన్ 22.4.2025 రోజున సిటీసివిల్‌కోర్టు సుధాకర్‌రెడ్డి వాదనను తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో సిటీ సివిల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.



సీఎం నోట బతుకమ్మకుంట..

ఈనెల 8న హైడ్రా పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంటపై మాట్లాడారు. స్థానిక కాంగ్రెస్ నేత వీహెచ్ 25 ఏండ్లుగా ఈ కుంట గురించి పోరాటం చేస్తున్నారని, హైడ్రా కుంటను స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. ఈ ఏడాది బతుకమ్మకుంటలోనే స్థానిక మహిళలు బతుకమ్మ ఆడుతారంటూ గొప్పగా చెప్పుకొచ్చారు. సీఎం మాట్లాడిన మరుసటి రోజే హైకోర్టు బతుకమ్మకుంటను యథాతథ స్థితిలో ఉంచాలంటూ స్టేటస్‌కో ఇచ్చింది. హైడ్రా, హెచ్ఎండీఏలతో పాటు ప్రైవేటు వ్యక్తులు అంటే ఇరు పార్టీలు జూన్ 10 వరకు ఎలాంటి పనులు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అక్కడ హైడ్రా కొనసాగిస్తున్న పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంట పనులను పర్యవేక్షిస్తారని, ఆయన వచ్చేనాటికి చెరువు పూడికతీత పనులు పూర్తికావాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఇంతలోనే మళ్లీ బతుకమ్మకుంట పనులకు బ్రేక్ పడడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

దాక్షిణాత్య ప్రప్రథమ వాగ్గేయకారుడు అన్నమయ్య

శాంతా బయోటిక్ అధినేత, పద్